రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పక్కన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

కులకచర్లలో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 29: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం చైర్మన్ కనకం మొగులయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు బంధు సాయం అందించడంతో పాటు రానున్న రోజుల్లో సబ్సిడీకి విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సొసైటీల ద్వారా వివిధ పుడ్‌ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, దీని ద్వారా చాలా మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. సొసైటీ రూ. మూడు కోట్ల 11లక్షల లాభాన్ని ఆర్జించడం గొప్పవిషయమన్నారు. మహారాష్ట్ర కోపరేటీవ్‌కు సంబంధించి సొసైటీ ద్వారా చక్కెర కర్మాగారాలను ఏర్పాటు చేసి చెరుకు పండించేవారికి సబ్సిడీ రుణాలు అందించి, కేంద్ర ప్రభుత్వ సాయం తీసుకుంటున్నారని, అదే విధంగా మనరాష్ట్రంలో కూడా చేయాలని సూచించారు. రైతులు పండించిన పంటలు నిల్వ ఉంచేందుకు కోల్డ్‌స్టోరేజిలను నిర్మించాలని, ప్రాసెసింగ్ వస్తులకు మార్కెటింగ్ కల్పించాలన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నామని, నిధుల కొరతతో కొంత ఆలస్యం అవుతుందని తెలిపారు. రెండు వందల యూనిట్ల కంటే తక్కువగా ఉంటే కరెంట్ బిల్లు చెల్లించకూడదని తెలిపారు. విద్యుత్ అధికారులు ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయని, పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన వెంటనే వాటిని అర్హులకు అందిస్తామని అన్నారు. తనకు రాజకీయ భవిష్యత్తును ఇచ్చింది కులకచర్ల మండలమేనని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తనను భారీ మెజారిటీతో గతంలో జడ్పీటీసీగా గెలిపించారని, ఆతరువాత ఏకగ్రీవంగా పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారన్నారు. తరువాత తనను డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. కులకచర్లలో చేసిన సేవలకు ప్రతిఫలమే తాండూరు ప్రజలు ఆదరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కులకచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, చౌడాపూర్ అధ్యక్షుడు అశోక్, పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, కులకచర్ల ఎంపీటీసీ ఆనందం, నాయకులు కొండయ్య, కృష్ణారెడ్డి, నర్సింహులు, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సమావేశానికి పరిగి నేతలు

తెలంగాణభవన్ వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో పరిగి నియోజకవర్గ నాయకులు

పరిగి, మార్చి 29: హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశానికి పరిగి నియోజకవర్గం లోని వివిధ మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు.
ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నాయ కత్వం లో పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, గండీడ్, చౌడా పూర్, మహ్మదాబాద్ మండలాలకు చెందిన పార్టీ అధ్య క్షులు, పరిగి మున్సిపల్ చైర్మన్ అశోక్, జడ్పీటీసీలు రాం దాస్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, నాయకులు సత్తినేని సుధాకర్‌రెడ్డి, పీరంపల్లి రాజు, శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

వికారాబాద్, మార్చి29 : తెలంగాణ రాష్ట్ర ప్రజలపై దేవుడి కృప ఉండాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కాంక్షించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కూతురు అనన్య అల్లుడు చేతన్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం

ఎగిసిపడుతున్న మంటలు

పరిగి, మార్చి 29: షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి కిరాణం దుకాణంలోని వస్తువులు, బంగారం, నగదు అగ్నికి ఆహుతయ్యాయి. పరిగి మండలం యాబాజీగూడ గ్రామానికి చెందిన నారాయణకు చెందిన కిరాణ దుకాణం, లేడీస్ కార్నర్‌లో గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. అప్పటికే నిద్రిస్తున్న నారాయణ, ఆయన కుటుంబసభ్యులకు అగ్నికీలలు ఎగిసిపడి వేడితో తేరుకొని చూడగా భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించి నీటితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక యంత్రం ఘటనా స్థలానికి చేరుకునే సమయానికి వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. దుకాణం, ఇల్లు ఒకే దగ్గర ఉంటుంది. దీంతో అగ్నిప్రమాదంలో ఆరు తులాల బంగారం, అరకిలో వెండి, రూ.మూడులక్షల విలువ చేసే దుస్తులు, సుమారు రూ.6 నుంచి రూ.7లక్షల విలువ చేసే కిరాణ సామాగ్రి, సుమారు లక్ష రూపాయలు నగదు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు శనివారం ఉదయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

పరిగి, మార్చి 29: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పరిగి మండలంలోని రంగాపూర్, పరిగి పట్టణంతోపాటు పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో ఆయన పాల్గొన్నారు. రానున్న కాలంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసేది ఏమి లేదన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీ లేవి నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. దేశ ప్రజలందరూ మరోసారి నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, ఈసారి బీజేపీకి 400 సీట్లు ఖాయమన్నారు. దేశం అభివృద్ధి పథంలో కొనసాగాలంటే నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన పిల్లల కోసం, దేశం కోసం, దేశ భవిష్యత్తు కోసం మోదీని ఎన్నుకోవాలని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 17 స్థానాలలో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బేనేటి మారుతీ కిరణ్, నర్సింహ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద యాత్రలో బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి

బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవం

కులకచర్ల, మార్చి 29: మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా రులు బొడ్రాయికి పాలా భిషేకం నిర్వహించిన అనంతరం మహి ళలు నీళ్లతో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాల కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వికారాబాద్, మార్చి 29 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన ఘటన మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోమిన్‌పేట మండలం చీమలదరి గ్రామ శివారులో సర్వేనంబర్ 172 లో ఒక గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభించింది. అతడి వయస్సు సుమారు 65– 70 సంవత్సరాలు వరకు ఉంటుంది. అతడి శరీరం పైన ఎలాంటి గాయాలు లేవని, రెండు, మూడు రోజుల నుంచి రోడ్డు వెంబడి ఒక్కడే ఒంటరిగా తిరుగుతూ ఆకులు అలములు తింటున్నట్టుగా ఇక్కడి గ్రామ ప్రజలు చెప్పారు. వేసవికాలం అయినందున డీహైడ్రేషన్ అయ్యి చనిపోయి ఉంటాడన్నారు.ఎవరికైనా సమాచారం తెలిస్తే మోమిన్ పేట్ పోలీస్ స్టేషన్‌కు 8712670037 సమాచారం అందించాలని తెలిపారు.

కాటేదాన్‌లో బాలిక దారుణ హత్య

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 29: ఓ బాలిక తలపై బండరాయితో దాడిచేసి.. దారుణంగా హత్య చేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఓ బాలిక తలపై బండరాయితో మోది హత్య చేసి వెళ్లిపోయారు. తెల్లవారుజామున ఉదయం 5 గంటల సమయంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్, డాగ్ స్క్వైడ్‌ను రప్పించి.. ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. అయితే, నిందితలను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి.. దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా జల్‌పల్లి ప్రాంతానికి చెం దిన బాలికగా గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన మోహిన్ (31) ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

శ్వాసమీద ధ్యాసతో సంపూర్ణ ఆరోగ్యం

కులకచర్ల, మార్చి 29: శ్వాసమీద ధ్యాసతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. శుక్రవారం కులకచర్ల మండల పరిధిలోని కామునిపల్లి, పీరంపల్లి, బండవెల్కిచర్ల, రాంనగర్, సాల్వీడ్ గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడికి గురయ్యేవారికి ధ్యానం ఎంతో తోడ్పడుతుందని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్టారెడ్డి, గుండం తిరుపతయ్య, వెంకటేశ్, గుండం శైలజ, శోబిత, చెన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

రూ.2.86 కోట్ల నగదు సీజ్

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా గ్రేటర్ వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగానే ఎన్నికల కోడ్ వచ్చిన ప్పటి నుంచి ఇప్పటి వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో రూ. 2.86 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ తెలిపారు. రూ.51.76 లక్షల విలువ గల ఇతర వస్తువులను పట్టుకున్నట్లు ఆయన వివరించారు. 11 కేసుల్లో రూ. 50వేలకు మించి, ఆధారాలు లేని రూ. 80,03,590 నగదు సీజ్ చేయగా, 9 కేసులకు సంబంధించి రూ.20,74,590 విడుదల చేసినట్లు రోనాల్డ్ రాస్ తెలిపారు. సీజ్ చేసిన నగదులో రూ.10 లక్షలకు మించి పట్టుబడిన రెండు కేసులను ఐటీ శాఖకు బదిలీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 10 కేసుల్లో రూ. 77, 03,590 సీజ్ చేయగా, 8 కేసులకు సంబంధించి రూ.17,74,590 నగదు రిలీజ్ చేశామని, రూ.59,29,000 నగదుకు సంబంధించి రెండు కేసులను ఐటీ శాఖకు పంపినట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఒక కేసులో రూ.3 లక్షలు సీజ్ చేయగా, సరైన ఆధారాలు సమర్పించడంతో విడుదల చేశామని తెలిపారు. అత్యవసరమైన కేసులను (పర్యాటకులు) వెంటనే పరిశీలించి నగదును విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్ 9618888110, కమిటీ కన్వినర్ మొబైల్ నంబర్ 9177872249లో సంప్రదించాలని సూచించారు.

ప్రణాళికా విభాగం అధికారులకు మెమోలు

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లోని ప్రణాళికా విభాగంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున అవినీతి ముద్ర పడిన హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో ఏ స్థాయి అధికారి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తున్నామని సంకేతాలిచ్చేందుకు ఉన్నతాధికారులకు మెమోలు జారీ చేసినట్లు సమాచారం. గండిపేట మండల పరిధిలోని పుప్పాల గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 314, 317, 330, 332 పరిధిలో ఉన్న స్థలంలో మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన 100 అడుగుల రోడ్డులో తమ భూములు పోయాయని కొందరు టీడీఆర్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఆయా స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్ నంబర్లు, వాటి యజమానులు ఎవరు అన్న విషయాలను అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ (ఏపీఓ) పరిశీలించకుండానే వారికి టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) కింద పరిహారాన్ని ఇవ్వాలని సిఫారసు చేశారు. దీంతో ఈ సంఘటనలో మెట్రో పాలిటన్ కమిషనర్ ఏపీఓను సస్పెండ్ చేశారు. ఈ ఉదంతంపై పూర్తి స్థాయిలో విచారణ చేసేందుకు హెచ్ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించి విచారణ చేపట్టారు. అందులో భాగంగానే ప్లానింగ్ విభాగంలో ఇద్దరు ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా మెమోలు ఇచ్చి.. వారి నుంచి సమగ్ర వివరణ కోరనున్నారని తెలిసింది. విచారణ మొక్కుబడిగా కాకుండా ఇందులో బాధ్యులైన ఉన్నతాధికారుల పాత్ర ఎంత వరకు ఉంది.. ఎవరి వత్తిడి మేరకు ఏపీఓ చేశారు.. అన్న వివరాలను రాబట్టే పనిలో విచారణ అధికారి ఉన్నారు.

కల్వరి టెంపుల్‌లో ప్రత్యేక పార్థనలు

అలరించిన క్రీస్తు శిలువ ప్రదర్శన

మాదాపూర్, మార్చి 29: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌కు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో కల్వరి ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఏసు ప్రభువును శిలువపై వేలాడదీసిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. భక్తులు ఉపవాసం ఉంటూ క్రీస్తు ప్రార్థనల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఆసియాలోనే అత్యంత గుర్తింపు పొందిన కల్వరి మందిరానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కల్వరి నిర్వాహకులు భక్తుల భద్రతకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి మొద లు కొని సాయంత్రం 6 గంటల వరకు నాలు గు ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దైవజనులు, కల్వరీ టెం పుల్ వ్యవస్థాపకుడు, డాక్టర్ పి. సతీశ్‌కుమార్ క్రీస్తు జననం, శిలువ ప్రదర్శనను గురించి వివరిస్తూ క్రీస్తు సందేశాలను భక్తులకు తెలియజేశారు. అనంతరం భక్తులు ఏసును స్తుతిస్తు శిలువ యాత్ర చేస్తూ ప్రార్థనలు చేశారు.

కల్వరి టెంపుల్‌కు భారీగా తరలివచ్చిన భక్తులు

ఒకటిన బహిరంగ వేలం

పూడూరు,మార్చి 29: దామగుండ రామలింగేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 1వ తేది ఉదయం 10 గంటలకు కొబ్బరి కాయల విక్రయం, వాహనాల పార్కింగ్ ఫీజు వసూల్ కోసం సంవత్సరం పాటు హక్కు పొందుటకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తునట్లు దేవాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ వేలం పాట పూడూరు గ్రామ పంచాయతీ వద్ద కమిటీ సభ్యులు, అర్చకుల అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు. కాగా వచ్చే నెల 3వ తేదీ నుంచి దామగుండ రామలింగే శ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

తాను మరణిస్తూ.. జీవనదానం

జితేందర్ రెడ్డి (ఫైల్)

ఖైరతాబాద్, మార్చి 29 : తాను మరణిస్తూ ఐదుగురికి కొత్త జీవితాన్ని అందించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గోపాలగిరికి చెందిన మిర్యాల జితేందర్ రెడ్డి (48) రైతు. ఆయన భార్య మిర్యాల నవిత. సాయిశ్రీ, సుదీప్ రెడ్డి సంతానం. ఈ నెల 26న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని సోమాజిగూడలోని యశోద దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు గురువారం బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు. అవయవ దానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

విద్యార్థులను హోంకు అప్పగింత

కాచిగూడ,మార్చి29: ఇంట్లో చెప్పకుండా చార్మినార్ చూడడానికి వచ్చి, కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంలో తిరుగుతున్న ముగ్గురు విద్యార్థులను కాచిగూడ రైల్వే పోలీసులు చేరదీశారు. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన శివం మిశ్రా(17) పం డిత్ కోర్సు చదువుతున్నాడు. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కిరణ్‌సింగా (16) పదో తరగతి చదువుతున్నది. వీరిద్దరు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యారు. కిరణ్‌సింగా స్నేహితురాలైన హేన్‌పుష్ప (15) 9వ తరగతి చదువుతుంది. వీరిద్దరు కలిసి హైదరాబాద్‌లోని చార్మినార్ చూసేందుకు ప్లాన్ వేసుకున్నారు. ఈ ముగ్గురు రైలులో హైదరాబాద్‌కు వచ్చి కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–1లో దిగి దిక్కు లు చూస్తు తిరుగుతుండగా.. అదే సమయంలో డ్యూటిలో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రావు గమనించి చేరదీశాడు. కిరణ్‌సింగా, హేన్‌పుష్పను ఆశ్రిత స్వచ్ఛంద సంస్థకు అప్పగించగా, వారు అఫ్జల్‌గంజ్‌లోని ఓపెన్ షల్టర్ హోంకు తరలించి, శివం మిశ్రాను సైదాబాద్ హోంకు తరలించినట్లు బీజీ ప్రసాద్‌రావు పేర్కొన్నారు

ఓల్డ్ స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం

శంషాబాద్ పట్టణంలో ఓల్డ్ స్క్రాప్ గోదాంలో మంటలు అర్పుతున్న ఫైర్ సిబ్బంది

శంషాబాద్ రూరల్, మార్చి 29 : నివాస ప్రాంతాల్లో ఉన్న ఓల్డ్ స్క్రాప్ గోదాంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటన శుక్రవారం శంషాబాద్ పట్టణంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని రాళ్లగూడ రోడ్డులో ఉన్న కేజీఎస్ ఓల్డ్ స్క్రాప్ గోదాంలో ఉదయం 10 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగినట్టు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్, మున్సిపల్ సిబ్బంది కలిసి మంటలు అదుపుచేశారు. నివాస ప్రాంతాల్లో గోదాంలకు అనుమతి ఇవ్వకూడదని స్థానికులు కోరారు. స్థానిక మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు. గోదాం చుట్టూ ఉన్న చెత్తకు ఎవరో నిప్పుపెట్టారని, దీంతో అగ్నిప్రమాదం సంభవించిందని గోదాం యజమాని మహ్మద్ జహంగీర్ తెలిపారు. దాదాపు రూ. 10 లక్షల మేరకు ఆస్తి నష్ట జరిగినట్టు పేర్కొన్నారు. లక్షకు పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ఒక ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపారు.

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కొండాపూర్ ఫ్లైఓవర్‌పై ఇరువైపుల వాహనాలకు అనుమతి

కొండాపూర్, మార్చి 29 : ఐటీ కారిడార్‌లో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రయోగాత్మక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మాదాపూర్ ఐకియా దగ్గర చేపట్టిన ట్రాఫిక్ డైవర్షన్ విజయవంతం కావడంతో మరో ముందడుగు వేస్తూ కొండాపూర్ – గచ్చిబౌలి మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వైపు ట్రాఫిక్ నియంత్రణను తగ్గించే పనిలో భాగంగా కొండాపూర్ ఫ్లైఓవర్‌పై ఇరువైపుల వాహనాలకు అనుమతిస్తున్నట్లు మాదాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్టీవో కార్యాలయం వద్ద ఫ్లైఓవర్‌ను ఆయన ఏసీపీ సత్యనారాయణ, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఫ్లైఓవర్‌పై ఇరువైపుల వాహనాలను ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అనుమతిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం యధావిధిగా ట్రాఫిక్ నియమాలు కొనసాగుతాయన్నారు. ఈ చర్యలు ట్రాఫిక్ అదుపులోకి వస్తే భవిష్యత్తులో యధావిధిగా కొనసాగించనున్నట్లు తెలిపారు.

కొండాపూర్ ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసు అధికారులు